సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 6 । జూలై । 2025



సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు.



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు.



శ్రీనృసింహ హోమం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ నృసింహ హోమం జరిగింది.

న్యూస్‌రీల్

రైవాడ జలాశయంలో చేపల వేట నిషేధం

- జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ



రైవాడ జలాశయం

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో చేపల వేటను వచ్చేనెల 31 వరకు నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి జి. విజయ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. చేపల సంతానోత్పత్తి సమయం కావడంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చిన చేపల వేట నిషేధం ఆగస్టు నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. నిబంధనలను అతిక్రమించి వేట సాగిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని ఆమె హెచ్చరించారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం



లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న పదో అదనపు జిల్లా జడ్జి నరేష్

అనకాపల్లి టౌన్: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఉపకరిస్తాయని, లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పదో అదనపు జిల్లా జడ్జి నరేష్ తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా ఎదురైన గొడవలతో కేసులు పెట్టుకుని కాలంతో పాటు ఆర్థికంగా నష్టపోకూడదని వివరించారు. కోర్టు చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కక్షిదారుల ప్రయోజనం కోసం సుప్రీంకోర్టు ఈ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు, అడిషనల్ సబ్ కోర్టు న్యాయమూర్తి రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా హర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

1,114 కేసులు పరిష్కారం



యలమంచిలిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

యలమంచిలి రూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం స్థానిక న్యాయస్థానాల సముదాయంలో సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ అధ్యక్షతన నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1,114 కేసులు పరిష్కారమయ్యాయి.వివిధ కేసుల్లో కక్షిదారులకు రూ.1,66,67,280 చెల్లింపులు జరిగాయి. న్యాయమూర్తులు జి.స్పందన, కె.రమేష్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ,లోక్ అదాలత్ సభ్యులు డి.వెంకటరావు, పి.వి.రమణ,పలువురు న్యాయవాదులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేరు, తారకరామ జలాశయాల్లో పెరుగుతున్న నీటి మట్టం



పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో పెద్దేరు, తారకరామ జలాశయాలల్లో నీటి మట్టం క్రమేపి పెరుగుతోంది. పెద్దేరు జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, శనివారం నాటికి 135.80 మీటర్లకు చేరింది. 110 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తాటిపర్తి వద్ద తారకరామ జలాశయంలో నీటి మట్టం క్రమేపి పెరుగుతోంది.

- ‘ఉపాధి’లో పెండింగ్ బిల్లులు రూ.132 కోట్లు
- నిధుల కోసం కాంట్రాక్టర్ల నిరీక్షణ
- పేరుకుపోయిన ‘పల్లె పండగ’ పనుల బకాయిలు
- పలు చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు
- మిగిలిన పనులు చేసేందుకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

బిల్లులు రాక.. పనులు సాగక



చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటలో అసంపూర్తిగా నిలిచిన రోడ్డు నిర్మాణం

సాక్షి, అనకాపల్లి:

ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్‌తో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులకు చెల్లింపులు జరగడం లేదు. కొద్ది నెలలుగా బిల్లులు మంజూరు కావడం లేదు. అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నా.. నిధులు రావడం లేదు. దీంతో రూ.132 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. అప్పులు చేసి మరీ కాంట్రాక్టర్లు సీసీ రోడ్లు, ఇతర పనులు చేపట్టారు. బిల్లులు ఎప్పుడొస్తాయో తెలియక కాంట్రాక్టర్లు లబోదిబో మంటున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నా కాంట్రాక్టర్లు సహకరించడం లేదు. చెల్లింపులు లేకపోతే ఎలా పనులు చేస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. మిగిలిన పనులను అసంపూర్తిగా వదిలేశారు.

నాలుగు నెలలు దాటినా..

గత ఏడాది అక్టోబర్ 14వ తేదీ నుంచి ‘పల్లె పండగ’ పేరిట గ్రామ సభలు నిర్వహించి, సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇతర నిర్మాణాలను చేపట్టేందుకు వినతులు స్వీకరించారు. అప్పటి నుంచి ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పూర్తయిన పనుల బిల్లులను తొలిదశలో అధికారులు అప్‌లోడ్ చేశారు. నాలుగు నెలలు దాటినా కాంట్రాక్టర్లకు తొలి దశ నిధులు విడుదల కాలేదు. బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు కొన్ని చోట్ల అసంపూర్తిగానే పనులు నిలిపివేశారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం వేసిన రాళ్లు, కంకర, ఇసుక వర్షాలకు కొట్టుకుపోయి రహదారులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి.



సబ్బవరంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రెండు నెలలైనా విడుదల కాని బిల్లులు

అసంపూర్తిగా పనులు...

ఉపాధి హామీ పథకం బిల్లులు రాకపోవడంతో సబ్బవరం, నర్సీపట్నం, నాతవరం, రావికమతం, చోడవరం, నక్కపల్లి, కశింకోట, రోలుగుంట, గొలుగొండ, దేవరాపల్లి మండలాల్లో పల్లె పండగ పనులను కాంట్రాక్టర్లు అసంపూర్తిగా నిలిపివేశారు. కొన్ని చోట్ల మందకొడిగా సాగుతున్నాయి. పనులు పూర్తి చేయాలంటూ ఇంజినీర్లు నోటీసులు జారీ చేస్తున్నా బిల్లులు విడుదలైతేనే పనులు చేపడతామని కాంట్రాక్టర్లు ఖరాఖండీగా చెప్పేస్తున్నారు.

గత ప్రభుత్వంలోనే మేలు..

కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ‘పల్లె పండగ’ పనులు చేయడానికి పోటీ పడ్డారు. కానీ బిల్లులు అందకపోవడంతో డీలా పడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే త్వరగా బిల్లులు వచ్చేవని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కోరుతున్నారు.

కాగా పెండింగ్ బిల్లుల విషయాన్ని పీఆర్ ఈఈ వద్ద ప్రస్తావించగా.. రోడ్ల పనులు ఒకింత నెమ్మదిగా జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే పూర్తిగా నిలిచిపోలేదన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. త్వరలో నిధులు విడుదలవతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ.11 కోట్లు మాత్రమే చెల్లింపులు

జిల్లాలో 166 కిలోమీటర్ల పొడవున 1,354 రోడ్ల నిర్మాణ పనులకు రూ.143 కోట్లు ఖర్చు చేసినట్టు అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇంతవరకు రూ.11 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.132 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబరు నుంచి ‘పల్లె పండగ’ పేరుతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు వంటి నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ కింద 189 కిలోమీటర్ల పొడువుగల 1,734 రోడ్ల నిర్మాణ పనులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కాబట్టి బిల్లులు త్వరగా మంజూరవుతాయన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు పోటీపడి మరీ గ్రామాల్లో పనులు చేపట్టారు. ఫిబ్రవరి 15వతేదీ నాటికి జిల్లాలో 166 కిలోమీటర్ల పరిధిలో 1,354 రోడ్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. వీటికి సంబంధించి రూ.143 కోట్లు విడుదల చేయాలంటూ ఉపాధి హామీ పథకం వెబ్‌సైట్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశారు. మార్చి నెలాఖరునాటికి నిధులు విడుదల కావాల్సి ఉంది. కానీ జూలై నెల కూడా వచ్చేసింది. ఇంకా నిధులు విడుదల కాలేకపోవడంతో కాంట్రాక్టర్లు మిగిలిన పనులు నిలిపివేశారు.

10న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలోని 1955 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 10 మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం, తల్లికి వందనం పథకం అమలుపై నియోజకవర్గ, మండల అధికారులతో ఆమె శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 2.12 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, టీచర్లతో ఆయా విద్యాలయాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. పాఠశాలలను, జూనియర్ కళాశాలలను సుందరంగా అలంకరించి, విద్యార్థులు, తల్లిదండ్రులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి పండగ వాతావరణంలో సమావేశం జరుపుతామని చెప్పారు. విద్యార్థి తల్లి పేరుతో ఒక మొక్క నాటడం ఈ ఏడాది థీమ్‌గా తీసుకున్నట్టు తెలిపారు. పాఠశాల ఆవరణలో గానీ, ఇంటి వద్ద గానీ మొక్క నాటవచ్చని చెప్పారు. విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరిపి, వారి ఆరోగ్య స్థితిపై 10న రిపోర్ట్ ఇస్తారన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులను కూడా ఈ సమావేశాలకు ఆహ్వానించనున్నట్టు చెప్పారు. పూర్వ విద్యార్థులు, అక్కడే చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన గొప్ప వ్యక్తులను కూడా ఆహ్వానించి, సన్మానించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. బాలికల రక్షణ, సైబర్ క్రైమ్, ఆరోగ్యం,డ్రగ్స్,గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను నియమిస్తామని చెప్పారు. జిల్లా స్థాయిలో డీఆర్వో ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్టు ఆమె తెలిపారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, సీపీవో జి.రామారావు, డీవీఈవో వినోద్ బాబు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లలో మళ్లీ అదే నిర్లక్ష్యం

- తొలిపావంచా వద్ద కూలిన షెడ్
- మారని ఇంజినీరింగ్ అధికారుల తీరు
- తప్పిన పెను ప్రమాదం

సింహాచలం: ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న గిరి ప్రదక్షిణ ఉత్సవ ఏర్పాట్లలో భాగంగా సింహాచలం కొండదిగువ తొలి పావంచా వద్ద నిర్మిస్తున్న తాత్కాలిక షెడ్ శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన దేవస్థానం ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి బహిర్గతం చేసింది. సింహాచలంలోని కొండ దిగువ తొలిపావంచాకి ఒక విశిష్టత ఉంది. గిరి ప్రదక్షిణ రోజుల్లో ఇక్కడే కొబ్బరికాయ కొట్టి భక్తులు నడక ప్రారంభిస్తారు. 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి తిరిగి ఇక్కడే కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ ముగిస్తారు. ఆ రోజు తొలి పావంచా వద్ద నెలకునే రద్దీ అంతా ఇంతా కాదు. వీరి సౌకర్యార్థం తొలిపావంచా పక్కనే ఉన్న అర ఎకరం విశాల ప్రాంగణంలో దాదాపు 20 క్యూలను ఏర్పాటు చేశారు. భక్తులు ఎండ, వాన నుంచి రక్షణ పొందేందుకు రెండు రోజులుగా ఈ షెడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ పనులను ఇంజినీరింగ్ పర్యవేక్షించకుండా పూర్తిగా కాంట్రాక్టర్‌పైనే వదిలేశారు. పైగా ఈసారి రాష్ట్రంలోని పలు దేవస్థానాల నుంచి 20 మంది వరకు ఇంజినీరింగ్ అధికారులను డిప్యూటేషన్‌పై ఇక్కడకు రప్పించారు. అయితే నిర్మాణ పనుల నాణ్యతను పర్యవేక్షించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది చందనోత్సవం రోజున గోడకూలి ఏడుగురు మరణించిన ఘటన నుంచి కూడా అధికారులు పాఠాలు నేర్చుకోలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన దేవస్థానం ఈవో వి.త్రినాథరావు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.5.80 లక్షల విలువైన ఈ పనులను కేఎస్‌ఆర్ సప్లయర్స్ అనే కాంట్రాక్టర్‌కు అప్పగించగా, వారు మరో సబ్-కాంట్రాక్టర్‌తో పనులు చేయిస్తున్నట్లు తెలిసింది. క్రేన్ సహాయంతో పనులు చేస్తుండగా షెడ్ కూలిందని ప్రాథమికంగా నిర్ధారించారు. కాగా.. భక్తుల భద్రత దృష్ట్యా, కూలిన షెడ్‌ను పూర్తిగా తొలగించాలని, ఇకపై ఎలాంటి షెడ్లు ఏర్పాటు చేయకుండా కేవలం క్యూలు మాత్రమే కొనసాగించాలని ఈవో ఆదేశించారు. ఉత్సవాల సమయంలో ఇదే ఘటన జరిగి ఉంటే పరిస్థితి దారుణంగా ఉండేదని పలువురు భక్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



పడిపోయిన షెడ్లు

గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

- విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని సమన్వయంతో విజయవంతం చేద్దామని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరి ప్రదక్షిణకు 5–6 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీస్ బందోబస్తు, క్యూలు, రద్దీ ప్రదేశాల్లో తోపులాటలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి 200 మీటర్లకు ఒకటి చొప్పున 132 తాగునీటి పాయింట్లు, 500 మరుగుదొడ్లు, ఆరు కంట్రోల్ రూమ్‌లు, ఐదు చోట్ల పబ్లిక్ అడ్రస్ సిస్టం, 13 పార్కింగ్ ప్రాంతాలు, 50 ఉచిత బస్సు సర్వీసులు, 18 నెట్‌వర్కింగ్ ఆసుపత్రులకు అనుసంధానంగా 32 వైద్య శిబిరాలు, 18 అంబులెన్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. రద్దీ ప్రాంతాల్లో 190 ఎల్‌ఈడీ దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం 9 జనరేటర్లు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా 9, 10 తేదీల్లో మద్యం దుకాణాలు మూసివేత, అప్పుఘర్ వద్ద 5 బోట్లు, 60 మంది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని కలెక్టర్ వెల్లడించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, రమేష్‌బాబు, వంశీకృష్ణ, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితర ప్రజా ప్రతినిధులు సూచించారు.



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్

మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథం ప్రారంభం

దేవస్థానం ఈవో త్రినాథరావు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తొలిపావంచా వద్ద అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతి రాజు ప్రచార రథాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆ రోజు రాత్రి 10 నుంచి 11 గంటల మధ్యలో రథం ఆలయానికి చేరుకుంటుందని, స్వామి పవళింపు సేవ, ఇతర లాంఛనాల అనంతరం 10వ తేదీ ఉదయం 5 గంటలకు స్వామి దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. దర్శనాలు సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి 5.30 నుంచి 7 గంటల వరకు కొనసాగుతాయని వెల్లడించారు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్, సీపీ శంఖబ్రత బాగ్చి, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడుగడుగునా నిలదీత

- పి.ధర్మవరంలో హోంమంత్రికి ఎదురైన అనుభవం
- సుపరిపాలనపై ప్రజల్లో అసంతృప్తి



హోంమంత్రి అనితను ప్రశ్నిస్తున్న మహిళలు

ఎస్.రాయవరం: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులకు అడుగడుగునా నిలదీతలు, అసంతృప్తులు ఎదురవుతున్నాయి. ఎస్.రాయవరం మండలం పి.ధర్మవరంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హోంమంత్రి వంగల పూడి అనితకు ఈ అనుభవం ఎదురైంది. తమకు వృద్ధాప్య పింఛను రాలేదని, తల్లికివందనం పథకం వర్తించలేదని, గ్రామంలో వీధి రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్రాంతి పండగ లోగా రోడ్లన్నీ బాగు చేస్తామని, కొత్తరోడ్లు వేస్తామంటూ హామీలు ఇచ్చారని, అలాగే అర్హులైన వారందరికీ పింఛన్లు, తల్లికి వందనం పథకం ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం ఇస్తామంటూ ప్రచారం చేశారని, అందరికీ మాటెలా ఉన్నా ఒక్కరికి కూడా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందలేదని పలువురు మహిళలు వాపోయారు.గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలన్నీ అర్హులందరికీ అందజేస్తామన్నారు. ఇది తెలుసుకోవడం కోసమే సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లికివందనం పథకం వర్తించని వారు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలు మంత్రిని, టీడీపీ నాయకులను నిలదీసే సన్నివేశాలు, ప్రశ్నిస్తున్న అంశాలను ఫొటోలు, వీడియోలు తీయకుండా టీడీపీ నాయకులు జాగ్రత్త పడుతున్నారు.

టీడీపీలో గ్రూపుల గోల

ఇక టీడీపీకి సంబంధించి గ్రూపుల పోరుకూడా మంత్రి ముందుకు వచ్చింది. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ఉంటే పార్టీకి సంబంధించిన సమాచారం కేవలం ఒక వ్యక్తికి మాత్రమే తెలియజేయడం ఎంతవరకు సమంజసమని పలువురు కార్యకర్తలు మంత్రిని ప్రశ్నించారు. ఇలా అయితే పార్టీకి నష్టం జరుగుతుందని, అందరినీ కలుపుకొని పోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తూతూ మంత్రంగా..

బుచ్చెయ్యపేట : మండలంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం తూతూ మంత్రంగా సాగింది. మంగళాపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట, పి.భీమవరం, చిన అప్పన పాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు నాయకులతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. నాయకులంతా ఫొటోలకు ఫోజులివ్వడానికే పోటీ పడ్డారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా సుందర లత



నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కోచర కె.ఆర్. సుందర లతను నియమించారు. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పెంచిన ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పేరుతో పాదయాత్ర చేసినప్పుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టాలని ఇచ్చిన పిలుపు ఏమైందని ఆయన ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు బిగించడంపై ఉన్న శ్రద్ధను సూపర్ సిక్స్ పథకాలు అమలు పై పెట్టాలని ఆయన తెలిపారు. అదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందం వల్ల రాష్ట్రంపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని, తక్షణమే ఈ ఒప్పందం రద్దు చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రకటనలు ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు ఒప్పందం రద్దు చేయలేదో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేశ్వరి, జి.ఫణీంద్ర కుమార్, అనకాపల్లి మండల కార్యదర్శి వియ్యపురాజు, జిల్లా సమితి సభ్యులు గొర్లె దేముడు బాబు, నాయకులు కోరిబిల్లి శంకరరావు, కాసు బాబు,పోతురాజు,సత్తిబాబు,త్రినాథ్,సత్యనారాయణ, ఎం.సూరిబాబు, ఈశ్వరరావు,బుజ్జి పాల్గొన్నారు.

నేడు, రేపు కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : కిరండూల్ మార్గంలో నడిచే రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 6, 7వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్- కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

- ఈ నెల 6,7వ తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్- కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

పూరీ రథయాత్ర స్పెషల్ రద్దు

రేక్ అందుబాటులో లేని కారణంగా విశాఖపట్నం-పూరీ-విశాఖపట్నం మధ్య నడిచే స్పెషల్ రైలును రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 6వ తేదీన విశాఖపట్నం-పూరీ(08313) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన పూరీలో బయల్దేరాల్సిన పూరీ-విశాఖపట్నం(08314) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

దేవరాపల్లి స్కూల్ మూసివేతకు కూటమి నేతల కుట్ర

- రూ.కోట్ల విలువ చేసే స్థలంపై కన్ను
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



దేవరాపల్లి: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మెయిన్ స్కూల్ మూసివేతకు కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ. కోట్ల విలువ చేసే పాఠశాల స్థలంపై కొందరు కూటమి నేతలు కన్నేశారని ఆరోపించారు. పథకం ప్రకారం 3,4,5 తరగతులను ఎస్సీ కాలనీలో పాఠశాలకు పంపించేసి, ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన మెయిన్ స్కూల్‌ను 1,2 తరగతులకే పరిమితం చేసి ఫౌండేషన్ స్కూల్‌గా మార్చేశారన్నారు. దీన్ని ఒకటి రెండేళ్లు పాటు కొనసాగించి పిల్లలు లేరన్న సాకుతో మూసి వేయాలని కుయుక్తులు పన్నుతున్నారన్నారు. దీంతో పలువురు పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరుకుల కాలనీ, కొరుప్రోలు వీధి చెందిన 3,4,5 తరగతుల విద్యార్థులు రోజూ రానుపోను ఆటోకు రూ. 20 చెల్లించి ఎస్సీ కాలనీలో మోడల్ స్కూల్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మెయిన్ స్కూల్‌ను బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్పు చేసి, పేద పిల్లల చదువులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

బీమాతో ధీమా

- తక్కువ ప్రీమియంతో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు
- గ్రామస్థాయి జన సురక్ష పేరిట పథకాలు
- మూడు నెలల కాలంలో ప్రీమియం చెల్లించేలా అవగాహన సదస్సులు

మునగపాక: చిన్న ప్రీమియం.. అందరికీ పెద్ద రక్షణ అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. పలు పథకాలను అమలు చేస్తూ ప్రజలకు చేదోడు వాదోడుగా నిలుస్తోంది. తక్కువ ప్రీమియంతో బీమా సదుపాయం దక్కించుకునేలా గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. మూడు నెలల కాలంలో అర్హులందరితో ప్రీమియం చెల్లించేలా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇలా.....
ప్రధానమంత్రి సురక్ష బీమా పథకానికి లబ్ధిదారు ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. ఇలా చెల్లించిన వారికి ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు అందుతుంది. ఈ పథకం తీరు తెన్నులు ఇలా.. మరణం లేదా శాశ్వత పూర్తి వైకల్యం సంభవించినట్టయితే రూ.2 లక్షల ప్రమాద బీమా కింద సాయం అందుతుంది. శాశ్వత, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష బీమా సాయం అందుతుంది. సంవత్సరానికి కేవలం రూ.20 ప్రీమియంగా చెల్లించాలి. 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు.

ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం ఇలా..
ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల మేర జీవిత బీమా యోజన కింద అందజేస్తారు. వయస్సు 18 నుంచి 50 సంవత్సరాల వారికి ఈ పథకం కింద అర్హులుగా నిర్ణయించారు.

అటల్ పెన్షన్ పథకం ఇలా...
కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన అటల్ పెన్షన్ విధానం అమలు తీరు ఇలా ఉంది. 60 సంవత్సరాల వయస్సు తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు కనీస హామీ పెన్షన్. చందాదారుడు మరణిస్తే జీవిత భాగస్వామికి అదే పెన్షన్ లభిస్తుంది. చందాదారుడు, అతని జీవిత భాగస్వామి మరణించినట్టయితే తర్వాత నామినీ 60 సంవత్సరాల వయస్సు వరకు సేకరించిన పెన్షన్ సంపదను అందుకుంటారు. 18 నుంచి 40 సంవత్సరాల వయస్సున్న పౌరులు ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు.

3 నెలల ఆర్థిక చేరిక కేంద్రీకృత ప్రయత్నం...
కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన జన సురక్ష కార్యక్రమం మూడు నెలల పాటు అమలు జరిగేలా చర్యలు చేపట్టారు. జూలై 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అర్హులైన వారు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ మూడు నెలల కాలంలో ప్రీమియం చెల్లించిన వారికి మాత్రమే బీమా పథకాలు అమలులోకి తీసుకువస్తున్నారు. భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు ఈ జన సురక్షను అందుబాటులోకి తీసుకువచ్చారు.

గ్రామ సంఘాల ద్వారా జన సురక్షపై అవగాహన..
వెలుగు కార్యాలయం అధికారులు గ్రామ జన సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ద్వాక్రా సంఘ సభ్యులకు సురక్ష కార్యక్రమం ద్వారా జరిగే మేలును ఎప్పటికప్పుడు వివరిస్తున్నారు. ఎంత ప్రీమియం చెల్లిస్తే బీమా పథకాలు అందుతాయన్న విషయమై సందేహాలను నివృత్తి చేస్తున్నారు. చిన్న ప్రీమియం అందరికీ పెద్ద రక్షణ అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశ పెట్టింది.


జన సురక్ష కార్యక్రమానికి హాజరైన మహిళలు

అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



గ్రామ సురక్ష పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో ద్వాక్రా మహిళలకు ఈ పథకం తీరుతెన్నులపై అవగాహన కల్పిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. వయస్సు ప్రామాణికంగా తీసుకొని ప్రీమియం చెల్లించేలా చర్యలు చేపడుతున్నాం.
– వై.బాలరాజు, వెలుగు ఏపీఎం

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు పరామర్శ


మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, పార్టీ అధ్యక్షుడు అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు, నాయకులు

నర్సీపట్నం: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు శనివారం పరామర్శించారు. ఐదు రోజులుగా విష జ్వరంతో బాధపడుతున్న గణేష్ విశాఖ మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నారు. ఈ మేరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శరగడం చిన అప్పలనాయుడు, యలమంచిలి ఎంపీపీ గోవింద్, తదితరులు ఉన్నారు.

చెరకు ఉత్పత్తులను వృద్ధి చేయడమే లక్ష్యం


గిరిజన రైతులకు చెరకు ఉత్పత్తి, సాగుపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

తుమ్మపాల: గిరిజన ప్రాంతాల్లో చెరకు ఉత్పత్తులను మరింత వృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని ప్రాంతీయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు డాక్టర్ సిహెచ్.ముకుందరావు, ప్రధాన శాస్త్రవేత్త చెరకు డాక్టర్ బి.ఆదిలక్ష్మి అన్నారు. అఖిలభారత సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో చెరకు గిరిజన ఉప ప్రణాళిక కింద ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 1 నుంచి 5 వరకు గిరిజన రైతులకు చెరకు సాగు విధానాల సాంకేతిక పరిజ్ఞానంపై ప్రధాన శాస్త్రవేత్త (తెగుళ్లు) డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ప్రధాన శాస్త్రవేత్త పురుగుల విభాగం డాక్టర్ బి.భవాని శిక్షణ నిర్వహించారు. బెల్లం తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. 25 మంది గిరిజన రైతులు వివిధ ఉన్నత శ్రేణి ప్రాంతాల రైతులు శిక్షణ పొందారన్నారు. చెరకు జ్యూస్ చేసుకునే బకెట్లు, ఎరువులు వేసుకునే పాత్రలు, చెరకు నరికే కత్తులు, వర్మి కంపోస్టు కోకోపీట్, ఎల్లో మెస్సూర్ బయో ఫెర్టిలైజర్స్, కేజీ బెల్లం అచ్చులు రైతులకు పంపిణీ చేశారు.

కిమ్స్ మార్పిడికి కేర్ ఆఫ్ క్యూ 1 హాస్పిటల్స్




డాక్టర్ టి.రమణమూర్తి, చీఫ్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, క్యూ వన్ ఆస్పత్రి

విశాఖపట్నం: రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ అంటే ఆంధ్రప్రదేశ్‌లో క్యూ వన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ టి. రమణమూర్తి గుర్తుకొస్తారు. గత 21 ఏళ్ల కాలంలో దాదాపు 26 వేల జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు చేశారు. కీళ్ల వ్యాధులను నిర్మూలించే అన్ని రకాల రేడియాలజీ సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. రోబోటిక్ శస్త్రచికిత్స తర్వాత రెండో రోజే నడక ప్రారంభించవచ్చని డాక్టర్ రమణమూర్తి తెలిపారు. అధునాతన టెక్నాలజీతో శస్త్రచికిత్సలు చేస్తున్న డాక్టర్ రమణమూర్తి రోబోటిక్ వైద్యంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నారు. 'రెండు ఎముకలు కలిసి కీళ్లు ఏర్పడతాయి. ఈ ఎముక చివర భాగంలో వెల్లని మృదులాస్థి (కార్టిలేజ్) వల్ల నొప్పి లేకుండా నడవడం సాధ్యమవుతుంది. వయసు, జాయింట్ గాయాలు, రుమేటిక్ ఇబ్బంది వల్ల కార్టిలేజ్ అరిగిపోవడాన్ని ఆర్థరైటిస్ అంటారు. నొప్పి, వాపు, రాపిడి వల్ల శబ్దాలు, మెట్లు ఎక్కలేకపోవడం, కింద కూర్చోలేకపోవడం ఆర్థరైటిస్ లక్షణాలు. శరీర బరువు నియంత్రించడం, మంచి ఆహారం తీసుకోవడం, క్రమపద్ధతిలో ఫిజియోథెరపీ చేయడం వల్ల మోకాళ్ల అరుగుదలను నివారించవచ్చు. మోకాళ్ల అరుగుదల తక్కువగా ఉన్నప్పుడు నివారణ మార్గాలు పాటించడం, నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు నొప్పి మాత్రలు వేయడం, కీళ్లకు విస్కో సప్లిమెంటేషన్ తీసుకోవడం, కార్టిసోన్లు ఆర్థోస్కోపీ ద్వారా కొంత వ్యాధి తీవ్రత తగ్గుతుంది. కానీ పూర్తిగా అరిగిన కీళ్లకు కీళ్ల మార్పిడి మాత్రమే నొప్పి నుంచి ఉపశమనం ఇవ్వగలదు' అని డాక్టర్ రమణమూర్తి తెలిపారు. రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ ద్వారా జీరో ఎర్రర్ మోకాళ్ల మార్పిడి సాధ్యమవుతుందన్నారు. సాధారణంగా 60 ఏళ్లపైబడిన వారికి మోకాళ్ల అరుగుదల అవుతుంది. అయితే కరోనా బారిన పడినవారిలో ఎక్కువ మంది హిప్ సమస్యతో బాధపడుతున్నారు. కరోనా చికిత్స కోసం స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల 40 ఏళ్ల దాటిన వారికి కూడా హిప్ సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్య గతంలో పోల్చుకుంటే ఏడు రెట్లు అధికమైందని డాక్టర్ రమణమూర్తి వివరించారు.

ADVT

మెగా లోక్ అదాలత్‌లో 1076 కేసుల పరిష్కారం


మాట్లాడుతున్న 9వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి రత్నకుమార్

చోడవరం: స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. 9వ ఏడీజే కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ కోర్టు, అదనపు సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో పలు కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని విభాగాలకు చెందిన 1076 కేసులను పరిష్కరించారు. అత్యధికంగా ఎన్‌టీపీ కేసులు 946 పరిష్కరించారు. అనంతరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి రత్నకుమార్ మాట్లాడుతూ చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలకు కోర్టులకు ఎక్కకుండా రాజీమార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సూర్యశక్తి, చోడవరం, కె.కోటపాడు సీఐలు అప్పలరాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సెజ్ కాలనీలో ఆటిజం శిక్షణ కేంద్రం

అచ్యుతాపురం రూరల్: సెజ్ పునరావాస కాలనీలో ఆటిజం సపోర్ట్ శిక్షణ కేంద్రం ప్రారంభించినట్టు యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయనతోపాటు రాష్ట్ర సమగ్ర శిక్షణ ఆటిజం కేంద్రాల నిపుణులు శ్రీరామ్ కమల్ మనోజ్ ఇక్కడ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటిజం శిక్షణ కేంద్రంలో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్ శిక్షణ, లెర్నింగ్ సపోర్ట్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ మ్యాథ్స్ రోబోటిక్ ల్యాబ్స్, అడ్వాన్స్‌డ్ ఫిజియో, స్పీచ్ ఎబిలిటీ, రిహాబిలిటేషన్ థెరపీ అందిస్తున్నారు. దివ్యాంగ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి హైటెక్ థెరపీ, ఈత కొలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆటిజం, దివ్యాంగ విద్యార్థులకు శిక్షణ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల డిజిటల్ విద్య రాష్ట్ర రిసోర్స్ పర్సన్ బి.మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.


సెజ్ కాలనీలో సందర్శించిన ఎమ్మెల్యే సుందరపు, ఆటిజం నిపుణులు శ్రీరామ్ కమల్ మనోజ్

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు


పశువైద్యాధికారులతో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యశాఖ అధికారి రామ్మోహనరావు

అనకాపల్లి: పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు జిల్లా పశువైద్యశాఖ అధికారి డాక్టర్ వి.రామ్మోహనరావు తెలిపారు. ఆదివారం జూనోసిస్ డే వేడుకలను పురస్కరించుకుని స్థానిక గాంధీనగరం జిల్లా ఆస్పత్రి ఆవరణలో శనివారం జిల్లాలో అన్ని మండలాలకు చెందిన పశు వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయడం అన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

15న మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ'

అనకాపల్లి: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు పెంచాలని జీవీఎంసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు జంగ్ కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక జోనల్ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్ బి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ మున్సిపల్ పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ డీఏలు, రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ సత్వరం విడుదల చేయాలన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అందని ద్రాక్షగా మారాయని మండిపడ్డారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అందక, మరోవైపు పిల్లల ఉన్నత చదువులు, కుటుంబ పోషణ, రవాణా ఖర్చులు పెరిగి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కేటగిరీల వారీగా వేతనాలు అంద జేస్తున్న ప్రైవేట్ సంస్థల్లో కార్మికులకు కనీస వేతన చట్టాలు ఏ రకంగా అమలవుతాయని ప్రశ్నించారు. జోన్ పరిధిలో ఇంజనీరింగ్, నీటి సరఫరా, టౌన్ ప్లానింగ్, స్కూల్ స్వీపర్లు, పార్కు, కూలీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిమ్మకాయల నర్సింహమూర్తి, ఎర్రంశెట్టి అప్పలరాజు, బంగారి రవి, సోమదుల శ్రీనివాస్, సింగవల్లి అజయ్, ఎర్రం శెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జీవీఎంసీ జోనల్ కమిషనర్ రమణకు వినతిపత్రం అందిస్తున్న కోన లక్ష్మణ

ఇన్‌చార్జి ఎంపీపీగా గోవిందరావు ప్రమాణస్వీకారం


గోవిందరావును గజమాలతో సత్కరిస్తున్న కంబాల జోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు


గోవిందరావుని సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం, తదితరులు

ఎస్.రాయవరం: స్థానిక ఇన్‌చార్జి ఎంపీపీగా బొలిశెట్టి గోవిందరావు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ ఎంపీపీగా ఎన్నికైన కిసు బోయిన వెంకటలక్ష్మి వ్యక్తిగత కారణాలతో జీవీఎంసీ రాజీనామాచేయడంతో ఆమె స్థానంలో వైస్ ఎంపీపీ గోవిందరావుకు ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు అప్పగించారు. వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, మండలంలో నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు గోవిందరావుకు అభినందనలు తెలిపారు. దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలు, గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు మాట్లాడుతూ గోవిందరావు మండల ప్రజల సంక్షేమానికి కృషి చేయడంతోపాటు పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. కూటమినేతలు ప్రలోభాలకు గురిచేసినా ఎస్.రాయవరం మండలం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఐక్యతతో ఉన్నారని దానికి కారణం బొలిశెట్టి గోవిందరావేనని చెప్పారు. అంతకుముందు గోవిందరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించిన వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానని, మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ గోవిందరావును సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కారా దేవి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు దూలి శ్రీనివాసరావు, శానాపతి శ్రీరాములు, పాలవర్తి పాపారావు, కొక్కెర వెంకటరమణ, గాడి అప్పలనరసింహ, భూపతి అప్పారావు, బోడిపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, శానాపతి రాము, కేసుబోయిన వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదురవాడ, జిల్లా కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, అల్లాడ నగరాజు, చేకూరి శ్రీరామచంద్రరాజు, దాట్ల రామరాజు, సిగటాపు శ్రీనివాసరావు, కొప్పాడ రాజు, గుర్రం నానాజీ, కాసిపు అప్పన్న, కర్రి శ్రీను, ఉద్దండం సూర్యనారాయణ, అడ్డేపల్లి బొజ్జన్న, నారంబోయిన శ్రీనివాసరావు, శేషు, బోండా దివాణం, మందగుడుల వెంకటరమణ, కసిరెడ్డి అమ్మాజీ, కర్రి వరహాలరావు, సేట్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యువతకు కువైట్‌లో ఉద్యోగావకాశాలు

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఓట్ రయాణ భాగస్వామ్యంతో కువైట్‌లోని నిర్మాణ రంగంలో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ/డిప్లొమా చదివి సెరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ పనిలో 3 నుంచి 5 ఏళ్ల అనుభవం ఉండాలన్నారు. రెండేళ్ల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం 25 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుష అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నెలకు 200 నుంచి 250 వరకు కువైట్ దీనార్లు (రూ. 56 వేల నుంచి రూ.70 వేల వరకు) జీతం ఉంటుందన్నారు. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, నివాసం వంటి ఏర్పాట్లను కంపెనీ యాజమాన్యం చెల్లిస్తుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9988853335ను సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ లోపు www.nai punyam.apgov.in లో నమోదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

పాల సంఘాల పాలకవర్గం బాధ్యతలు

కశింకోట: మండలంలోని రెండు పాల సంఘాలకు కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు శనివారం బాధ్యతలు చేపట్టారు. కొత్తపల్లి సంఘ అధ్యక్షునిగా బద్ది గోవింద రావు, బుచ్చియ్యపేట సంఘ అధ్యక్షునిగా తిర్రి రామారావుతోపాటు పాలక వర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఉగ్గిన రమణమూర్తి, మాజీ సర్పంచ్‌లు బుదిరెడ్డి గంగయ్య, తిర్రి నూకి నాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో వసతులు కల్పించాలి

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావులను కలిసి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ఐక్య వేదిక నేతలు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగుల సహాయకులు వేచి ఉండేందుకు అదనపు గదులు ఏర్పాటు చేయాలని, మార్చురీ గదుల్లో ఫ్రీజర్ బాక్సులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం పూలు, తులసీమాలలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అర్చకుడు రేజేటి రామ చరణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

తొలి ఏకాదశి పూజలు నేడు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పాల్గొనాలని కోరింది.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 26 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4.750	4.750
రెండో రకం	3.450	3.450
మూడో రకం	2,800	2,800

అనకాపల్లి సినిమాలు

రాజా	: కృష్ణుడికి కెంతో
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: 3 డి
పర్తిసాయి	కుబేర
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: చంద్రేశ్వర
శ్రీ సత్య	: 3బీహెచ్‌కే
రామచంద్ర	: మార్గన్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 10 యూనిట్లు, బీ పాజిటివ్ -6, ఓ పాజిటివ్ -20, ఏబీ పాజిటివ్ -2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 334 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



తుమ్మపాలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు వాణిజగదీశ్వరి, వైద్య సిబ్బంది



అక్కిరెడ్డిపాలెం గ్రామంలోమేడపై కుండీలో నిల్వనీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

డెంగ్యూ డేంజర్

- వర్షాకాలంలో అప్రమత్తం కావాల్సిందే
- అడపాదడపా వర్షాలతో దోమల విజృంభణ
- ఈ నెల 31 వరకూ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

అనకాపల్లి: వర్షాకాలం వచ్చేసింది. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో దోమలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాణాంతకమైన డెంగ్యూ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, మంచినీటి నిల్వలు లేకుండా నిత్యం జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ సూచిస్తోంది. పరిశీలించడం, పరిశుభ్రపరచండి, మూతలు పెట్టండి నినాదంతో ఈ ఏడాది ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అనకాపల్లి మండలంలోని 32 పంచాయతీ పరిధిలో తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌లు ఉండగా, గ్రామాల్లో విలేజ్ క్లినిక్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ పాలనలో ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందాలంటే, వారు నివసించే ప్రదేశంలో వైద్య సౌకర్యాలు కల్పించాలని అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ప్రజలకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఏడిస్ ఈజిప్ట్ దోమతో డెంగ్యూ...

ఏడీస్ ఈజిప్ట్ దోమలు కుట్టడంతో మనిషికి డెంగ్యూ వైరస్ సోకుతుంది. ఆడ ఏడిస్ ఈజిప్ట్ దోమకాటు పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఈ జాతి దోమ పైన నల్లని, తెల్లని చారలు ఉండడంతో ఈ దోమలను టైగర్ దోమలు అన్ని కూడా పిలుస్తారు. ఈ దోమలు ఇంటి లోపల, ఆవరణలో ఉంటూ పగటి వేళల్లో మాత్రమే మనిషిని కాటు వేస్తాయి. అన్ని రకాల దోమల కంటే డెంగ్యూ దోమ బరువుగా ఉండడంతో 400 మీటర్ల కంటే ఎక్కువ దూరం ఎగరలేని స్థితిలో ఉంటాయి. దోమలోనే కాకుండా దోమ గుడ్లతోనూ వైరస్ ఉంటుంది. ఈ డెంగ్యూ దోమలు కేవలం మంచినీటి నిల్వలో మాత్రమే గుడ్లు పెడుతూ విస్తృతంగా పెరుగుతాయి.

పరిశుభ్రత పాటించాలి...

డెంగ్యూ దోమలు విజృంభిచకుండా గృహాలు, పరిసరాల్లోనూ పరిశుభ్రత పాటించాలి. మంచినీటి నిల్వలపై తప్పకుండా మూతలు పెట్టుకోవాలి. వారానికి ఒకసారి కచ్చితంగా డ్రైడేగా పాటిస్తూ నీటితొట్టెలు వంటివి శుభ్రం చేసుకోవాలి. ఇంటి ఆవరణలో బంతి, పుదీనా మొదలైన మొక్కలు నాటడం వల్ల డెంగ్యూ దోమలను నివారించే అవకాశం ఉంది. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలి. కొబ్బరి బొండాలు, టైర్లు, నీటి తొట్టెలు, పూలకుండీలు, ఎయిర్ కూలర్ల వెనుక శుభ్రం చేసుకోవాలి.

లక్షణాలు...

- ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి విపరీతమైన కండరాలు, కీళ్ల నొప్పులు
- కళ్ల నొప్పులు, కంటి కదలిక తగ్గడం, నొప్పి ఉంటాయి.
- ఒక్కోసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం ఉంటాయి.
- అధికంగా దాహం, నోరు తడారిపోవడం వంటివి ఉంటాయి.
- డెంగ్యూ వ్యాధి మూడు రకాలుగా ఉంటుంది. డెంగ్యూ జ్వరం, డెంగ్యూ హేమరేజ్, డెంగ్యూ పాక్‌సింద్రోమ్‌గా పేర్కొంటున్నారు.
- డెంగ్యూ దోమకాటు అనంతరం 3 నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి
- డెంగ్యూ సోకిన అనంతరం సాధారణంగా 80 శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది.
- వ్యాధి తీవ్రతతో రక్తంలోని ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది.
- వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు మాక్ ఎలీసా పరీక్షలు చేయించుకోవాలి.

డెంగ్యూపై ఈ నెల 31 వరకూ విస్తృత ప్రచారం....



వర్షాలు పడుతూ ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఒకవైపు వాతావరణంలో మార్పులతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. మరో వైపు నీటి నిల్వలు కారణంగా దోమలు విజృంభించే అవకాశం అధికంగా ఉంటుంది. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి.

– వాణీజగదీశ్వరి, వైద్యురాలు, తుమ్మపాల పీహెచ్‌సీ, అనకాపల్లి మండలం

'క్వారీ యజమానులతో మైనింగ్ అధికారుల కుమ్మక్కు'



మాట్లాడుతున్న సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

అనకాపల్లి టౌన్: మండలంలోని క్వారీ యజమానులతో కుమ్మక్కైన కొంత మంది మైనింగ్ అధికారులు, సిబ్బందిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ అనేక క్వారీల యాజమాన్యాలు తమకున్న పర్మిషన్ కన్నా అధిక విస్తీర్ణంలో మైనింగ్‌కు పాల్పడుతున్నాయన్నారు. మార్టూరు, బవులువాడ తదితర గ్రామాల్లో ఈ విధంగా చేయడంపై సంబంధిత శాఖకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కామెడీ కింగ్స్ నేడు

అనకాపల్లి: లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో 'కామెడీ కింగ్స్' కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు విల్లూరి వీరసంతోష్, బుద్ధ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జబర్దస్త్ యాక్టర్స్ గెడ్డం నవీన్, కోరుకొండ రంగారావు బృందం హాజరవుతుందన్నారు.

నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రధాన అర్చకుడు గిరిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకుడు పులఖండం గిరిబాబు తెలిపారు. స్వామివారి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8, 9 తేదీల్లో రాత్రి 7 గంటలకు అన్నమాచార్య వాగ్దేయ వరదాయిని భక్త బృందాలతో సంకీర్తనలు, జానపద నృత్యాలు, కోలాటం, 10న రాత్రి 7 గంటలకు గురువులకు, పండితులకు సత్కారం, 11న సాయంత్రం ఏ కొత్తర సహస్ర కలశ (1001) అష్టోతర శత కలశ (108), 12న ఉదయం 9 గంటల నుంచి శ్రీవారి చక్రస్నానం, రాత్రికి ఉత్సవం అనంతరం స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో మురళీకృష్ణ, అర్చకులు పులకండం విజయ్ బాబు, పులకండం ప్రసాద్, పులకండం రాజేష్ పాల్గొన్నారు.

రైల్వే రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్



ప్రదర్శన నిర్వహిస్తున్న వయోవృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు

అనకాపల్లి టౌన్: కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైల్వే, ఇతర రాయితీలను 2007 చట్టం ప్రకారం పునరుద్ధరించాలని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. స్థానిక వి.వి. రమణ రైతు భారతీ కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకంగా ప్రభుత్వం ఒక భవనం కేటాయించాలన్నారు. ఈ మేరకు పలు డిమాండ్‌లు నెరవేర్చాలని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాండ్రేగుల దుర్గాప్రసాద్, ఆడారి అప్పారావు, కొణతాల త్రినాథ్, విల్లూరి రామునాయుడు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ కార్మికుల ధర్నా



ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్: ఆర్టీసీలో ఆరేళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు పదోన్నతులను తక్షణమే కల్పించాలని జోనల్ అధ్యక్షుడు కె.జె. సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం భోజన విరామ సమయంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే వేయాలని, ఆర్టీసీలో ఖాళీ నియామకాలను వెంటనే చేపట్టాలని, 1–19 సర్క్యులర్‌కు విరుద్ధంగా ఇచ్చిన పనిష్మెంట్ ఆర్డర్స్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మెయింటనెన్స్ రాష్ట్ర కమిటీ మెంబర్ ఎస్.వి. రమణ, ఏపీజేఏసీ అమరావతి మహిళా జిల్లా కార్యదర్శి కె. లక్ష్మీరమణి, జిల్లా ప్రచార కార్యదర్శి బి.ఎస్. రావు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్' అమలు ఎక్కడ బాబు?

- ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన చంద్రబాబు
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై విస్తృత ప్రచారం చేయాలి
- కష్టపడిన నాయకులకు వైఎస్సార్‌సీపీలో గుర్తింపు
- మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

అనకాపల్లి: ఏడాది పాలనలో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. ప్రజలను నమ్మించి మోసం చేయడానికి చంద్రబాబు 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర ఉపయోగపడిందని ఎద్దేవా చేశారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమీక్ష సమావేశం శనివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే నినాదంతో గ్రామ స్థాయి నుంచి పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ తమను గెలిపిస్తే సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ఒక్కొక్క ఇంటికి ఇంత లబ్ధి చేకూరుతుందని ఇచ్చిన బాండ్ల విషయంపై ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జెండా మోసిన గ్రామ స్థాయి నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. కూటమిలో ఉన్న నాయకులకు గుర్తింపు లేకపోవడంతో కత్తులు దువ్వుతున్నారన్నారు. వారం రోజుల్లో 9 మందితో గ్రామ కమిటీలు, 5 అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రజల పక్షాన పోరాటం తప్పదు

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమ రథసారథి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కోసం ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను గెలిచిన మరుక్షణం సీఎం చంద్రబాబు చెత్తబుట్టలో వేసేశారని ఆరోపించారు. 50 సంవత్సరాలు పైబడిన బీసీలకు నెలకు రూ.4 వేలు పింఛన్, నిరుద్యోగులకు భృతి, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం వంటి సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేదో కూటమి నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈనెల 8న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తర్వాత నియోజకవర్గంలో నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, అభిమానులు

తల్లికి వందనంలో 20 లక్షల మందికి ఎగనామం

మాజీ ఎమ్మెల్యే, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ మోసగాడు చంద్రబాబు.. వేషగాడు పవన్ కల్యాణ్ కలిసి ప్రజలను నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. అందుకే బీజేపీ నాయకులు ఎన్నికల మేనిఫెస్టోపై తమ ఫొటోలు లేకుండా జాగ్రత్త పడ్డారని గుర్తు చేశారు. తల్లికి వందనం పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల మంది అర్హులు ఉంటే.. నేటి వరకూ 44 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని, ఇందులో 20 లక్షల మంది తల్లులను మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని గ్రామాల్లో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు.

కరోనాలోనూ సంక్షేమం ఘనత జగన్‌దే



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్ కుమార్, కరణం ధర్మశ్రీ, శోభా హైమావతి, జానకీరామరాజు, దిలీప్‌కుమార్

పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి మాట్లాడుతూ కరోనా వంటి విపత్తి సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మద్యం ద్వారా పుష్కలంగా ఆదాయం వస్తున్నా సూపర్‌సిక్స్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు. అంతకు ముందు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వి.సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట ఎంపీపీ కలగ లక్ష్మీగున్నయ్యనాయుడు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లెల సాయికిరణ్, అనకాపల్లి, కశింకోట మండలాల పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, 80, 84 వార్డుల ఇన్‌చార్జ్‌లు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, పార్టీ సీనియర్ నాయకులు కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, దాడి నారాయణరావు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కె.పద్మకుమారి, మర్రిపల్లి శోభ, నీటిపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

బుద్ధావతారంలో జగన్నాథుడు



బుద్ధావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గూడ్స్ రోడ్ ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి శనివారం బుద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కూచిపూడి నృత్య కళాకారులను నూకాంబికా ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను సత్కరించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వాహణాధికారి బి. మురళీకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు తిరుగు రథయాత్ర..

జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుగు రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



భరత్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకుడు

స్వామివారి సేవలో భరత్‌కుమార్

అనకాపల్లి: స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో సుభద్ర, బలభద్ర జగన్నాథస్వామి వారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి చిత్రపటాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80, 84 వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, కశింకోట ఎంపీపీ కలగ లక్ష్మీగున్నయ్యనాయుడు, నాయకులు ఉగ్గిన అప్పారావు, గైపూర్ రాజు పాల్గొన్నారు.



జగన్నాథస్వామిని దర్శించుకున్న 82వ వార్డు కార్పొరేటర్ సునీత జానకీరామరాజు దంపతులు



జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

నేడు తిరుగు రథోత్సవం:

కశింకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి బుద్ధునిగా భక్తులు దర్శనమిచ్చారు. వైశాఖ శుద్ధ తొలి ఏకాదశి పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం స్వామివారి తిరుగు రథోత్సవం జరగనుందని ధర్మకర్త శ్రీరామాచార్యులు తెలిపారు.

'పథకాలు అమలు చేయకుండా వేడుకలా?'

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసిన తర్వాతే సుపరిపాలన తొలి అడుగు వేడుకలు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పి.ఎస్.ఎస్. జోసెఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల హామీలను అమలు చేయాలని లేకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. తల్లికి వందనం గతేడాది ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సంక్రాంతిలోగా గతుకులు లేని రోడ్లు చూస్తారని బీరాలు పలికారని, వాస్తవంలో దసరా వచ్చినా రోడ్లు బాగుపడడం లేదని వాపోయారు. తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. లేదంటే ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 9న జరగనున్న గిరి ప్రదక్షిణ, 10న జరిగే ఆలయ ప్రదక్షిణ వేడుకల ఏర్పాట్లను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ శనివారం పరిశీలించారు. ఆయన దేవస్థానం ఈవో త్రినాథ రావు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు.